కనుల పండువగా కల్యాణోత్సవం

» ప్రారంభమైన కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

» స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు 7

పేదలపై పిడుగు

» పొలం పనుల్లో ఉన్నప్పుడే ఎక్కువ

» ప్రాణాలు కోల్పోతున్న రైతులు, కూలీలు

» ముందు జాగ్రత్తలతో తప్పనున్న ముప్పు 7


మొక్కజొన్నలు.. కొంటలేరు

- మార్కెట్లలో కొనుగోళ్లు కేవలం ప్రైవేటు వ్యాపారుల ఆధ్వర్యంలోనే..
- కనీస మద్దతు ధర కంటే తక్కువకు విక్రయం
- మార్క్‌ఫెడ్ కొనుగోళ్లకు మరో మూడు రోజుల సమయం
- ఐదు జిల్లాల్లో 1.18 లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభించని మార్క్‌ఫెడ్ అధికారులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ ఏడాది ఓవైపు ప్రకృతి రైతులపై కన్నెర్ర చేసి అతివృష్టితో అతలాకుతలం చేస్తుండగా మరోవైపు చీడపీడల బాధతో పంటలను కాపాడుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. సీజన్ జోరుగా ఉన్నప్పుడు యూరియా కొరతతో క్యూలలో నిల్చొని నిరీక్షించగా, ఇప్పుడు ఇన్ని కష్టాల మధ్య సాగుచేసిన పంటను అమ్ముకోలేక దయనీయంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పత్తి కొనుగోళ్ల ఆలస్యం కావడంతో రైతులు అతి తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారస్తులకు విక్రయించగా మిరప, వరి రైతులు చీడపీడలతో పంట దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మొక్కజొన్న రైతుల వంతు వచ్చింది. పంట చేతికి వచ్చినా వాటిని అమ్ముకోలేని పరిస్థితి. రైతులు మార్కెట్ యార్డులు, కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వర్షాలు ఇంకా తగ్గకపోవడం, ఎండ ఉన్నట్లే ఉండి అనుకోకుండా వర్షాలు పడుతుంటంతో మొక్కజొన్నలు తడుస్తున్నాయని వాపోతున్నారు. అయితే ప్రతీఏటా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతాయి. వ్యవసాయ అధికారులు ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేశారు? ఎంత దిగుబడి వచ్చే అవకాశం ఉందనే వివరాలను మార్క్‌ఫెడ్‌కు సంప్రదిస్తే ప్రభుత్వ ఆదేశాలతో కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఉమ్మడి పాలమూరు

(మిగతా 6లో..)



జడ్చర్ల మార్కెట్ యార్డులో కొనుగోళ్ల కోసం వేచి చూస్తున్న రైతులు

మద్దతు ధర రావడం లేదు



నేను ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఈ ఏడాది వర్షాలు బాగానే పడటంతో పంట కూడా తొందరగా వచ్చింది. జడ్చర్ల మార్కెట్ యార్డుకు మొక్కజొన్నలు తీసుకువచ్చాను. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. గతంలో ఇప్పటికే కొనుగోళ్లు చేపట్టేవారు. దీంతో ప్రైవేటు వ్యాపారస్తులు కొర్రీలు పెడుతూ మద్దతు ధర కంటే రూ. 400 నుంచి రూ. 500 వరకు తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర ఇస్తే బాగుంటుంది.

- రఘునందన్, జగ్‌బోయినపల్లి, మిడ్జిల్

వేచిచూడలేక విక్రయాలు



ప్రభుత్వం ప్రతీఏటా ఇప్పటికే కొనుగోళ్లు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టేవారు. కానీ, ఈ ఏడాది ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదు. కేవలం మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులే కొంటున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తే పోటీ ఉండి ధర మంచిగా వచ్చేది. కానీ, అలా లేకపోవడంతో ఎక్కువ రోజులు ఎదురుచూడలేక తక్కువ ధరకే విక్రయిస్తున్నాం. ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ అధికారులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- పరమేశ్, మొక్కజొన్న రైతు, తలకొండపల్లి

మిల్లర్ల మాయ!

- » గుట్టు చప్పుడు కాకుండా ధాన్యం విక్రయం
- » మిల్లర్ల వద్దే 23,503 మెట్రిక్ టన్నుల ధాన్యం
- » మెజార్టీ ధాన్యం బయటికి తరలించిన మిల్లర్లు
- » విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో బహిర్గతం
- » కాపాడాలని ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు
- » జరిమానాతో చెల్లించాలంటున్న అధికారులు



శ్రీరామ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

గద్వాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిల్లర్ల మాయాజాలం బయటపడుతున్నది. గద్వాలలో మూడు రోజుల క్రితం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులతో బట్టబయలైంది. 2022-23 సంవత్సరంలో కేటాయించిన యాసంగి ధాన్యాన్ని మెజార్టీ మిల్లర్లు విక్రయించేశారు. ఇప్పటి వరకు దాదాపు 23,503 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్ద ఉండాల్సి ఉండగా దాదాపుగా నిల్వలన్నీ ఖాళీచేసి కోట్ల రూపాయల ఆదాయం పొంది దానితో వ్యాపారం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా వారి వద్దే ధాన్యం ఉన్నా సివిల్ సప్లయ్ అధికారులు వాటిపై పర్యవేక్షించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఇచ్చే నివేదికలను మూలనపెట్టి మిల్లర్లతో గత అధికారి, ప్రస్తుతం ఉన్న అధికారి అంటకాగుతూ.. కోట్ల ఆదాయాన్ని వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రజాప్రతినిధుల చుట్టూ రైస్ మిల్లర్లు

రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దృష్టి గద్వాల మీద పడటంతో మిల్లర్లు తమను కాపాడాలని ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రాష్ట్ర మంత్రుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. అయితే 2022-23 ధాన్యం విషయంలో మాత్రం ఎవరూ కాపాడలేని పరిస్థితి ఉంది.

కాగితాలకే పరిమితం..

గద్వాలలో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 2022-23లో వానాకాలం ధాన్యాన్ని 51మిల్లులకు 28,904 మెట్రిక్ టన్నులను కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు దాదాపు 686 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ రూపంలో సూర్య ట్రేడర్స్ నుంచి రావాల్సి ఉన్నా అధికారులు కిమ్మనకుండా ఉన్నారు. 2022-23 యాసంగిలో 33 రైస్ మిల్లులకు 36,815 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. ఇందులో ఒక్క రైస్ మిల్లు నుంచి మాత్రం 100శాతం సీఎంఆర్ ప్రభుత్వానికి వచ్చింది. మిగిలిన 32 మిల్లులు 9,619 మెట్రిక్ టన్నులకు మాత్రమే సీఎంఆర్ పెట్టారు. మిగిలిన ధాన్యానికి గత ప్రభుత్వం టెండర్లు వేసింది. కాంట్రాక్టర్ ఇందులో 3,692 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్ల వద్ద నుంచి లిఫ్ట్ చేశాడు. మిగిలిన 23,503 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. దీనిని సీఎంఆర్‌గా మార్చి మిల్లర్లు పెట్టాల్సి ఉంది. అయితే సీఎంఆర్ పెట్టాలా..? కాంట్రాక్టర్ లిఫ్ట్ చేస్తారా..? అనేది తేలలేదు. దీనినే సాకుగా చూసుకున్న రైస్ మిల్లర్లు మెజార్టీ ధాన్యాన్ని లిఫ్ట్ చేసి విక్రయించేశారు. వాస్తవంగా సివిల్ సప్లయ్ అధికారుల నిబంధనల ప్రకారం ఈ ధాన్యం ఇప్పటికీ మిల్లర్ల వద్దే ఉండాలి. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పర్యవేక్షించాలి. కానీ మిల్లర్లు వారిని పట్టించుకోకుండా సివిల్ సప్లయ్ అధికారి అండదండలతో విక్రయించారు. మిల్లర్ల వద్ద ఉన్న ఈ ధాన్యం విలువ రూ.47కోట్లు ఇందులో దాదాపు రూ.30 కోట్ల విలువగల ధ్యాన్యం బయటికి విక్రయించినట్లు అధికారులతో పక్కా సమాచారం ఉంది. ఒక్క శ్రీరామ రైస్ మిల్లుకు 1,424 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయిస్తే అందులో 912మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైంది. అంతకంటే ఎక్కువగా కేటాయింపులు పొందిన రైస్ మిల్లు యజమానులు ధాన్యం క్రయవిక్రయాలలో ఆరితేరినవారు. వారివద్ద ఎంత మాయమై ఉంటుందో అంచనా వేస్తున్నారు. రైస్ మిల్లర్ల వద్ద అంటకాగుతున్న అధికారి అండదండలతోనే ఈ తంతంగం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రైస్ మిల్లర్ల వాదన ఇలా..

రైస్ మిల్లర్లు 2022-23 ధాన్యం విషయంలో తమను బాధ్యులను చేయవద్దని వాదిస్తున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో ధాన్యాన్ని లిఫ్ట్ చేయాల్సి ఉండగా 3,692 మెట్రిక్ టన్నులే లిఫ్ట్ చేశాడని, తమ వద్ద రెండేళ్లుగా ధాన్యం నిల్వ ఉండటంతో కాపాడేందుకు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. మిల్లర్ల వద్ద తేడా వచ్చిందంటే అది తరుగు మాత్రమేనని చెప్పుకొస్తున్నారు.

అదనపు కలెక్టర్‌ను అడగాలి

మిల్లర్ల మాయాజాలంపై సివిల్ సప్లయ్ అధికారి స్వామి కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా అది టెండర్ ధాన్యం అని వివరించారు. మీ డీటీలు ప్రతీనెల రిపోర్ట్ ఇస్తారు కదా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలోనే ఎందుకు బయట పడుతున్నాయని ప్రశ్నిస్తే అదనపు కలెక్టర్‌ను అడగాలని ఫోన్ పెట్టేశారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కారానికి నవంబరు 1 నుంచి 30వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడీ, జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిచ్చేందుకే భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. అందుకనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయకుంటే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోతుందని, ప్రజలకు నమ్మకం పెంచేలా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తహసీల్దార్లు ప్రతీ రోజు ఉదయం 8 గంటలకే గ్రామాలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణ రెడ్డిలు మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. నవంబరు 30వ తేదీ నాటికి దరఖాస్తుల శాశ్వత పరిష్కారానికి తహసీల్దార్లు, ఆర్డీవోలు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర



అమ్మవారి ఊరేగింపులో శిగం ఊగుతున్న భక్తులు

7

ఆలయాల్లో కార్తీక శోభ

అలంపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ పుణ్య క్షేత్రంలోని జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో కార్తీశోభ సంతరించుకున్నది. బుధవారం ఉదయం కార్తీక మాసం పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పుష్కరఘాట్ వద్ద తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించి, స్వామి, అమ్మవారి ఆలయాల ముందు కార్తీక దీపాలను వెలిగించారు. స్వామివారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమ అర్చన తదితర పూజలు చేశారు.



అమ్మవారి ఆలయం ముందు దీపాలు వెలిగించిన మహిళలు

ఉపాధిలో అక్రమాలకు చెక్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

6

వాంటెడ్

- వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రిలో వెంటాడుతున్న ఖాళీ పోస్టుల సమస్య
- ప్రధాన శాఖల పోస్టులన్నీ దాదాపు ఖాళీనే



వనపర్తి వైద్యవిభాగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గతంలో ఏరియా ఆసుపత్రిగా ఉన్న వనపర్తి ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ అందుకు అనుగుణంగా వైద్యులను, వైద్య సిబ్బందిని మాత్రం నియమించడం లేదు. ఫలితంగా ఉన్న కొద్దిపాటి వైద్యులపై, వైద్య సిబ్బందిపై పనిభారం పడుతోంది. రోగులకు కూడా అనుకున్న స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లా జనరల్ ఆసుపత్రికి ప్రతీరోజు వేల సంఖ్యలో రోగులు వస్తుంటారు.

ఖాళీ పోస్టులివే..

జిల్లా జనరల్ ఆసుపత్రి నిబంధన ప్రకారం వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందితో కలిసి 489 మంది స్టాఫ్ ఉండాలి. కానీ ప్రస్తుతం 337 మంది మాత్రమే ఉన్నారు. 157 పోస్టులు ఖాళీగా ఉన్నయి. ఇద్దరు అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు బదులు ఒక్కరే ఉన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్, బయో మెడికల్ ఇంజనీర్, బయో మెడికల్ టెక్నీషియన్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీఏఎస్ ఆర్ఎంవోలు 8 మంది ఉండాల్సిన చోట అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆసుపత్రిలోనే అత్యవసర విభాగం ఎంతో కీలకమైనది. కానీ అక్కడ 10మంది క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు అవసరం ఉండగా ఒక్కరే ఉన్నారు. 4 డెంటల్ టెక్నీషియన్ పోస్టులకు 4 ఖాళీగా ఉన్నాయి. వాటితో పాటు 16 మంది ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాల్సి ఉంది. కానీ అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 12 మంది ఫార్మసిస్టులకు 12 ఖాళీ, ఫిజియోథెరపిస్టు 4 పోస్టులకు 4 ఖాళీ, 8 మంది హెడ్ నర్సులకు 5మంది మాత్రమే ఉన్నారు. 354 మంది స్టాఫ్ నర్సులు అవసరం ఉండగా కేవలం 302 మంది మాత్రమే ఉన్నారు. చివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ గాడి తప్పుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా వైద్యులు, వైద్య సిబ్బంది, కార్యాలయ సిబ్బందితో కలిసి 152 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైద్యులపై పని భారం పడుతోంది

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఉన్న వారిపై పనిభారం పడుతోంది. ఖాళీ పోస్టుల భర్తీ విషయం చాలా పెద్ద అంశం. ఈ విషయం ఇప్పటికే కలెక్టర్ దృష్టిలో ఉంది. ప్రభుత్వం పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తే రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం.

- డాక్టర్ రంగారావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్ వనపర్తి

పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని ఫ్లాగ్‌డే ఈవెంట్‌లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్, బీచుపల్లి 10వ బెటాలియన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన బైక్‌ర్యాలీని జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ బైక్ నడిపి పోలీసులను ఉత్సాహపరిచారు. ర్యాలీలో అదనపు ఎస్పీ శంకర్, బీచుపల్లి 10వ బెటాలియన్ కమాండెంట్ జయరాజ్, డీఎస్పీ మొగిలయ్య, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయను

- నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎవరి దగ్గరైనా పనిచేసేందుకు సిద్ధం : ఎమ్మెల్యే బండ్ల

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయను, గద్వాల అభివృద్ధి కోసం ఎవరి దగ్గర అయిన తలవంచి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల నియోజకవర్గంలోని రహదారుల పునరుద్ధరణకు హామ్ అండ్ ఆర్‌అండ్‌బీ ద్వారా రూ. 316.45 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో హామ్(హైబ్రీడ్ యాన్యుటీ మోడల్) ద్వారా గద్వాల నియోజక వర్గంలో పంచాయతీ రోడ్లకు రూ. 154 కోట్ల నిధులు మంజూరు అయ్యావన్నారు. అలాగే గద్వాల నియోజకవర్గంలోని హామ్ ద్వారా ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి రూ.162.45 కోట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. 3,4 నెలల్లోనే రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గద్వాల నియోజక వర్గ అభివృద్ధిలో భాగంగా నవంబరు 25న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి నర్సింగ్ కళాశాల ప్రారంభిస్తారని, అలాగే రూ.80 కోట్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. కొందరు పనికట్టుకొని విమర్శలు చేస్తున్నారని, వారికి విమర్శలు చేయడం తప్ప ఇంకా ఏమి చేతకాదన్నారు. ఏది ఏమైనా ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. సమావేశంలో సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌గౌడు, విజయ్, మాజీ మునిసిపల్ చైర్మన్ బాబర్, నాయకులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

అయిజ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని బీజీఆర్ పాఠశాల ఆవరణలో బుధవారం జిల్లా స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగం నందు బాలుర, బాలికల విభాగంలో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలు 13 మండలాలకు చెందిన 350 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాధికారి రాములు, కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి తోట శ్రీనివాసులు, జీహెచ్ఎం తిమ్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో అయిజ మొదటి స్థానం, ఇటిక్యాల రెండవ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో గట్టు మొదటి స్థానం, అయిజ రెండవ స్థానంలో నిలిచాయి. సాయంత్రం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



ప్రథమ బహుమతి దక్కించుకున్న అయిజ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న సుధాకర్‌రెడ్డి

అచ్చంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వరుడిని శ్రీశైలం దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కట్టా సుధాకర్ దంపతులు బుధవారం ఈశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ ఈవో శ్రీనివాస్ రావు, అర్చకుడు వీరయ్యశాస్త్రీ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈశ్వరుడికి క్షీరాభిషేకం గణపతి, అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, జిల్లా నాయకులు రేనయ్య, నాగరాజు, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, కాట్రావత్ జ్యోతి నీలబాయ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కట్టా సుధాకర్‌ను శాలువాతో సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

నేటి నుంచి కంఠమహేశ్వర స్వామి

ఆలయంలో ఉత్సవాలు

- రేపు విగ్రహాల ప్రతిష్ఠ
- 25న కల్యాణం, 26న ఎల్లమ్మ, మైసమ్మల పూర్ణాహుతి
- ఉత్సవాలలో పాల్గొననున్న మంత్రులు



విద్యుద్దీపాలంకరణలో కంఠమహేశ్వర ఆలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్వీఎస్ వద్ద ఉన్న దేవునిగుట్టపై నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నారు. 24న కంఠమహేశ్వర స్వామి, సురమాంబ, వనం ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టనున్నారు. అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఎనుగొండ ఆంజనేయస్వామి ఆలయం నుంచి బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమం ఎనుగొండ నుంచి ఎస్వీఎస్ ఆసుపత్రి మీదుగా దేవుని గుట్టపై ఉన్న కంఠమహేశ్వర స్వామి ఆలయం వరకు కొనసాగుతుంది. దీనికోసం నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లను చేశారు.

ఈ బోనాల ఊరేగింపు కార్యక్రమంలో ఆధ్యాత్మికంగా ఎంతో పేరుగాంచిన జోగిని శ్యామల పాల్గొననున్నారు. 25న సాయంత్రం కంఠమహేశ్వర స్వామి ప్రథమ కళ్యాణ మహోత్సవం జరిపించనున్నారు. 26న వనం మైసమ్మ, వనం ఎల్లమ్మ దేవతల పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ప్రతిరోజు ఆలయంలో హోమాలు నిర్వహిస్తారు. హోమంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలలో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల పెద్దలు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లాలోని గౌడ కులస్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



తాడూరు పోలీస్‌స్టేషన్‌లో పాత నేర చరిత్ర కలిగిన వ్యక్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ గురుస్వామి

- తాడూరు ఎస్ఐ గురుస్వామి

తాడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడూరు మండలంలోని వివిధ గ్రామాల్లో కొన్నేళ్లుగా నేర చరిత్ర కలిగిన వారు మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గురు స్వామి హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో గతంలో నేర చరిత్ర కలిగిన 23మందిని పిలిచి పోలీస్ స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవలి రియాజ్ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇకపై గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు ఎక్కడా, ఎలాంటి నేరపూరితమైన కార్యక్రమాల్లో పాల్గొనరాదని సూచించారు. ఇకపై ఎవరైనా అలాంటి కార్యక్రమాల పట్ల ఆకర్షితులైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీసు శాఖలో జరుగుతున్న పరిణామాలతో పాత నేరస్థులను పిలిచి గట్టిగా హెచ్చరించారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్



వనపర్తి జిల్లాలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఈజీఎస్ కూలీలకు ఈకేవైసీ
- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- ఆధార్, జాబ్ కార్డుల వివరాలు యాప్‌లో నమోదు
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

వనపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. కూలీల ఆధార్ కార్డులు, జాబ్ కార్డులతో ఈకేవైసీ చేసుకుంటేనే అక్టోబరు నుంచి ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఎన్ఆర్ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి కూలీల ఆధార్, ఉపాధి కార్డు వివరాలను నమోదు చేసి ముఖ గుర్తింపు ఫొటో తీసి యాప్ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కూలీలు తమ ఆధార్, జాబ్ కార్డులతో ఉపాధి హామీ సిబ్బందిని కలిస్తే ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇందుకోసం కూలీలు, ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఈకేవైసీ పూర్తి చేయని కూలీలు ఇక నుంచి ఉపాధి పనుల్లో అవకాశం కోల్పోతారు.

● హాజరు నమోదు ఇలా

యాక్టివ్ కూలీల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి, పనికి రాగానే, పని పూర్తయ్యాక రెండుసార్లు ముఖ గుర్తింపు ఫొటోతీసి అప్‌లోడ్ చేయాలి. కూలీల వివరాలు యాప్‌లో నమోదు కాకపోతే ఉపాధి పనికి వెళ్లినా హాజరు పడదు. దీంతో కూలీ డబ్బులు ఖాతాలో జమ కావు. వేరే ప్రాంతంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా అది తప్పుడు హాజరు నిర్ధారిస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఉపాధి హామీ పథకంలో అవకతవకలను నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

● అవకతవకలను నిరోధించేందుకు...

కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు క్షేత్ర సహాయకులు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ.. నిధులు స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు, ఒకరి పేరు మీద మరొకరు వెళ్తున్నట్లు నమోదు చేస్తున్నట్లు తేలింది. మరోవైపు సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయటపడడం, రికవరీలు జరుగుతున్నా ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. ఈ క్రమంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర చిత్రాలతో పాటు పనిచేయకపోయినా చేసినట్లు అప్‌లోడ్ చేస్తున్నట్లు అనేక చోట్ల తేలింది. దీంతో కూలీలకు కూలీ గిట్టుబాటు కాక ఆశించిన స్థాయిలో వేతనాలు సైతం రావడం లేదు. గతంలో జాబ్ కార్డును ఆధార్ కార్డుకు అనుసంధానం చేసిన కొన్నిచోట్ల హాజరు నమోదులో తప్పిదాలు చేస్తున్నట్లు తేలింది. దీంతో వీటన్నిటికీ చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని తప్పనిసరి చేసింది.

● గత నెల 24 నుంచి నమోదు

గత నెల 24వ తేదీ నుంచి జిల్లాలోని 15 మండలాల్లో ఉపాధి కూలీల ఈకేవైసీ ప్రక్రియను ఉపాధి హామీ సిబ్బంది చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,21,890 జాబ్ కార్డులు ఉండగా 2,34,967 మంది కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టివ్‌గా పని చేసే కూలీల సంఖ్య 1,19,409 మంది ఉండగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 82,411 మంది కూలీల వివరాలను ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది యాప్‌లో నమోదు చేశారు. ఇంకా 36 వేల 998 మంది కూలీల వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈనెల చివరి కన్నా మిగతా కూలీల వివరాలను యాప్‌లో నమోదు చేసేలా చర్యలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

17 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు



గద్వాల మహాసభలో మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు

గద్వాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేరళ తరహాలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 17 రకాల వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ మూడవ జిల్లా మహాసభలు పట్టణంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభమయ్యాయి. అంతకుముందు మహాసభలకు ప్రారంభం సూచికగా హమాలీ సంఘం సీనియర్ నాయకుడు భీముడు సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కేరళలో కార్మికుడు చనిపోతే అక్కడి ప్రభుత్వం రూ.16లక్షలు పరిహారం చెల్లిస్తుందని, ప్రమాదం జరిగి గాయపడితే రూ.7లక్షలు అందిస్తుందన్నారు. అలాగే విద్య, గృహ అవసరాల కోసం రుణాలను అందిస్తుందని, 60 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి పెన్షన్ అందిస్తుందని తెలిపారు. హమాలీలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడం వల్ల సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అనంతరం ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లాలోని వివిధ మండలాల నాయకులు, సీఐటీయూ నాయకులు, హమాలీ సంఘం సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్నలు కొంటలేరు



వనపర్తి మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు

(5వ పేజీ తరువాయి)

జిల్లా పరిధిలో దసరా ముందు నుంచే మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. దసరా తర్వాత నుంచి మార్కెట్ యార్డుల్లో మొక్కజొన్నలు పోయడం ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. మరో రెండు లేదా మూడు రోజుల్లో ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నప్పటికీ తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

1.09 లక్షల ఎకరాల్లో సాగు..

మే చివరి వారం నుంచే ఉమ్మడి జిల్లాలో వర్షాలు ప్రారంభం కావడం, తర్వాత విరామం లేకుండా కురవడంతో గతంలో కంటే మొక్కజొన్న సాగు ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కువగా జరిగింది. ఈ ఏడాది 1.18 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. అత్యధికంగా నాగర్‌కర్నూలు జిల్లాలో సాగు కాగా అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో సాగైంది. అయితే ఎకరాకు 25 క్వింటాళ్ల సగటున 1.18 లక్షల ఎకరాలకు 29.70 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే అత్యధిక మంది రైతులు కంకులను మర ఆడించి, మొక్కజొన్నలను ఆయా మార్కెట్ యార్డుల్లో ఆరబోశారు. అయితే ప్రభుత్వ మద్దతు ధర రూ. 2400 కాగా రూ. 1800 నుంచి రూ. 2100 వరకు మాత్రమే ప్రస్తుతం లభిస్తోంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడితే మద్దతు ధర లభించేదని, కానీ ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తుండటం వల్ల మద్దతు ధర కంటే తక్కువకే విక్రయించుకోవాల్సి వస్తోందని అన్నారు. అయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లకు ప్రైవేటు వ్యాపారుల వల్లే ఆలస్యమవుతుందనే విమర్శలు వస్తున్నాయి. తాము కావాల్సిన మేర సేకరించిన తర్వాత ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టుకోవచ్చని ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని జిల్లాల వ్యవసాయ అధికారులు మార్క్‌ఫెడ్ అధికారులు పంట సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాలపై సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది.

పదేళ్ల తర్వాత సాగులో పెరుగుదల

గతంలో సాగునీటి వనరుల లభ్యత అంతగాలేని సమయంలో వానాకాలం సీజన్‌లో పత్తి తర్వాత రెండో అతిపెద్ద పంటగా ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్నను రైతులు సాగు చేసేవారు. అయితే సాగునీటి వనరుల లభ్యత పెరిగిన తర్వాత మొక్కజొన్న స్థానంలో వరి సాగును చేపట్టారు. వరుసగా వరిసాగు చేపట్టడం వల్ల పంట దిగుబడి సరిగా రాకపోవడం, పలు మార్లు వరిసాగుకు నీరు సరిపడా అందకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షం కురవడంతో మొక్కజొన్న సాగును అధికంగా చేపట్టారు. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలో 22,583 ఎకరాల్లో గతేడాది మొక్కజొన్న సాగు కాగా ఈ ఏడాది 37,474 ఎకరాల్లో సాగైంది. దాదాపు 15 వేల ఎకరాలో ఈ పంట సాగు పెరిగింది. నాగర్‌కర్నూలు జిల్లాలో గతేడాది 42,565 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా ఈ ఏడాది 58,516 ఎకరాల్లో సాగైంది. దాదాపు 15 వేల పైచిలుకు ఎకరాల్లో సాగు ఎక్కువగా జరిగింది. అయితే ఆరుతడి పంటలు సాగు చేయాలని పేరుకు చెబుతున్నప్పటికీ మార్కెటింగ్ సదుపాయం సరిగా లేనందునే ఆరుతడి పంటలసాగు తగ్గుతుందనడానికి తాజా ఉదాహరణలు చెప్పవచ్చు.

బిల్లులు వచ్చేశాయ్..

- ● మధ్యాహ్న భోజన గుడ్ల డబ్బులు ఉమ్మడి జిల్లాకు రూ.4.86 కోట్లు విడుదల
- ● తొమ్మిది, పది తరగతులకు మూడు నెలల బిల్లులు కూడా..
- ● కార్మికులకు గౌరవ వేతనం రూ.2 వేలూ..



పేట మండలం జాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

నారాయణపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాల మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు ఎట్టకేలకు ప్రభుత్వం విడుదల చేసింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు బుధవారం రాత్రి నారాయణపేట జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయానికి అందాయి. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఒకటవ తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు మధ్యాహ్న భోజనం గుడ్డు బిల్లులు, తొమ్మిది, పదో తరగతి మధ్యాహ్న భోజన బిల్లులు మూడు నెలల(ఏప్రిల్, జూన్, జూలై) నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే భోజనం వండే వర్కర్లు, హెల్పర్ల గౌరవ వేతనం గత సెప్టెంబరు నుంచి ఆగస్టు వరకు రూ.2 వేల మేర నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రొసీడింగ్ నెంబరు 244ను జారీ చేసింది. అలాగే, మధ్యాహ్న భోజనం గుడ్డు నిధులు ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఏప్రిల్, జూన్, జూలైకు సంబంధించిన బిల్లుల కోసం ప్రొసీడింగ్ నెంబరు 09, అక్టోబరు 15న ఉత్తర్వులు ఇవ్వగా, తొమ్మిది, పదో తరగతి సంబంధించి ఏప్రిల్, జూన్, జూలై పెండింగ్ బిల్లులు ఆర్‌సీ నెంబరు 07, అక్టోబరు 17న ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బిల్లుల కోసం ఎదురుచూస్తున్న వంట నిర్వాహకులతో పాటు మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీల వారికి ఊరట కలిగినట్లయింది. నిధుల విడుదలకు సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల వారీగా... ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు గుడ్డు బిల్లు రూ.4,86,87, 092.65 మంజూరు కాగా, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బిల్లు రూ. 6,11,23,644, వండేవారి గౌరవ వేతనం రెండు వేల ప్రకారం రూ.7,39,70,000 నిధులు విడుదలయ్యాయి.

జిల్లా పేరు	మధ్యాహ్న భోజనం గుడ్డు మూడు నెలల బిల్లు	9, 10 తరగతులకుగాను మూడు నెలల బిల్లు	వండేవారికి గౌరవ భృతి
నారాయణపేట	1,48,39,352.85	1,77,02,466	1,92,70,000
మహబూబ్‌నగర్	1,14,41,063.55	1,85,46,175	2,31,19,000
గద్వాల	94,82,228.35	84,01,030	1,07,83,000
నాగర్‌కర్నూల్	86,81,308.65	1,07,16,854	1,02,23,000
వనపర్తి	42,43,139.25	57,57,119	1,05,75,000
మొత్తం	4,86,87,092.65	6,11,23,644	7,39,70,000

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్

కబడ్డీలో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)లో భాగంగా రాష్ట్ర స్థాయిలో జరిగిన గేమ్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల జడ్పీ హై స్కూల్ విద్యార్థులు ఆడారు. ఇందులో అండర్-14 బాలుర విభాగం కబడ్డీలో విద్యార్థి జి.శివశంకర్ (9వ తరగతి) తెలంగాణ స్టేట్ లెవల్ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. విద్యార్థి ఏ.చరణ్(9వ తరగతి)అండర్-17చెస్ జిల్లా స్థాయి పోటీల్లో ఆరవ స్థానంలో విజయం సాధించాడు. క్రీడల్లో ప్రతిభ చాటిన ఇద్దరు విద్యార్థులను పెద్దకార్పాముల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాజాజి యావుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కే.దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం బుధవారం ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

అండర్-17 ఎస్‌జీఎఫ్

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీకి నిర్వహిస్తున్న ఎంపిక పోటీలు

అమ్రాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని బీకే.తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల వరప్రసాద్ వర్మ అనే విద్యార్థి అండర్-17 ఎస్‌జీఎఫ్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ సెలక్షన్ పోటీల్లో వరప్రసాద్‌వర్మ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా ఎన్మనగండ్లకు చెందిన జైనుద్దీన్ అనే విద్యార్థితో కలిసి ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులతోపాటు బీకే.తిర్మలాపూర్ గ్రామస్థులు హర్షం ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నవంబరు 11నుంచి 15వ తేదీ వరకు జరిగే అండర్-17 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి వాలీబాల్ సెలక్షన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడానికి తీవ్రంగా శ్రమించనున్నట్లు వరప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లను ప్రారంభించి 2.086 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటివరకు 446.061 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ప్రారంభించి 2.275 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటివరకు 433.524 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయి ఉత్పత్తిని చేపట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

విద్యుత్‌వైరు తగిలి యువకుడి మృతి

నవాబ్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైరు తగిలి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జగదీశ్(28) తన బొలెరో వాహనంలో ప్రైవేట్ నర్సరీ నుంచి బుధవారం అదే గ్రామానికి చెందిన బుచ్చన్నగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో తీసుకువచ్చిన మొక్కలు దించుతుండగా విద్యుత్ వైర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ విషయంపై ఎస్ఐ విక్రమ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

లైన్‌మన్‌పై దాడి: కేసు నమోదు

నవాబ్‌పేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి బిల్లులు వసూలు చేసేందుకు వెళ్లిన లైన్‌మన్‌పై వినియోగదారుడు దాడి చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం చాకలిపల్లి గ్రామానికి విద్యుత్ లైన్‌మన్‌గా అనిల్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 11నుంచి గ్రామానికి చెందిన చెన్నయ్య అనే వ్యక్తిని ఇంటి బిల్లు చెల్లించాలని కోరగా ఈరోజు రేపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. దీంతో గురువారం గ్రామం వెళ్లి చెన్నయ్య ఇంటి మీటర్‌నుంచి విద్యుత్ కనెక్షన్ తొలగించాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మరికల్ గ్రామంలో ఉన్న అనిల్ ఇంటికెళ్లి రూ.1020 బకాయి ఫోన్‌పే ద్వారా చెల్లించి మిగతా డబ్బులు తదుపరి బిల్లులో చెల్లిస్తానని లైన్‌మన్‌కు తెలిపారు. బుధవారం ఉదయం విద్యుత్ కనెక్షన్ తొలగించానని చెప్పడంతో ఆగ్రహానికి గురైన చెన్నయ్య బూతులు తిడుతూ చెంప చెల్లుమనిపించాడు. అడ్డుకోబోయిన భార్య సరితపై కూడా దాడి చేయడంతో ఇరుగు పొరుగువాళ్లు వచ్చి వారించారు. తనపై దాడి చేసిన చెన్నయ్యపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

మందపై నుంచి దూసుకెళ్లిన లారీ

» 167 గొర్రెల మృత్యువాత



సంఘటనా స్థలంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మల్లమ్మ

భూత్పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మేత కోసం గొర్రెలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లిన కాపరికి తీరని నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని కంటైనర్ లారీ మందపై నుంచి దూసుకెళ్లడంతో 167 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, రూరల్ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కుర్వ మల్లమ్మను కొన్నేళ్ల క్రితం భర్త ఆమెను వదిలేశాడు. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఆమె దాదాపు 2 వందల గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతోంది. 2 నెలల క్రితం పెద్దకుమారుడు కుర్వ రాజేశ్‌తో కలిసి గొర్రెల మందను మేత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు ప్రాంతానికి తోలుకెళ్లింది. ఈ నెల 21వ తేదీ సాయంత్రం నెల్లూరు జిల్లా, గుడూరు మండలంలోని మోచర్ల శివారులో గొర్రెలను మేపుతున్నారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని కంటైనర్ లారీ రోడ్డు పక్కన మేస్తున్న గొర్రెల మందపైనుంచి దూసుకెళ్లింది. దీంతో దాదాపు 167 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. కళ్లముందే గొర్రెలు చనిపోవడంతో మల్లమ్మ కండ్లు తిరిగి అక్కడే పడిపోయింది. కాసేపటికి తేరుకొని గొర్రెల కళేబరాలను చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. దాదాపు రూ. 16 లక్షలు నష్టం వాటిల్లిందని ఆమె వాపోయింది. విషయాన్ని తన స్వగ్రామం ఇప్పలపల్లిలో ఉంటున్న కుటుంబ సభ్యులకు తెలిపింది.

మార్కెట్ కూలీ అదృశ్యం

అచ్చంపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని లింగోటం తండాకు చెందిన శంకర్ (40) అదృశ్యం అయ్యాడు. అతడి భార్య మత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్చంపేట మార్కెట్ యార్డులో కూలీగా పని చేస్తున్న శంకర్ గత శనివారం పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. రెండు రోజుల పాటు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కల్వకుర్తి/ వెల్దండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష పడింది. ఎస్ఐలు జి.మాధవరెడ్డి, కురుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన సిల్వేరు రాజేందర్‌గౌడ్, జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల గ్రామానికి చెందిన చింతకింది నర్సింహ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని అరెస్టు చేసి, బుధవారం కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. నిందితులు రాజేందర్‌గౌడ్, నర్సింహలకు రెండు రోజుల జైలు శిక్ష, రూ. 600 రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి జడ కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐలు తెలిపారు.

రైలులో నుంచి జారి పడి తీవ్ర గాయాలు

» చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కృష్ణ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైలులో నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, కృష్ణ మండల కేంద్రంలో బుధవారం జరిగింది. రైల్వే కానిస్టేబుల్ మునిస్వామి తెలిపిన వివరాల ప్రకారం... ఓ గుర్తు తెలియని వ్యక్తి శనివారం అర్ధరాత్రి రైలులో నుంచి జారి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. రైల్వే పోలీసులు అతడిని అంబులెన్స్‌లో కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపటడతామని మునిస్వామి తెలిపారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఊట్కూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేపలు, నీటి కోళ్లను పట్టడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు వాగులో పడి గల్లంతయిన వ్యక్తి మృతదేహం రెండు రోజుల తర్వాత లభ్యమైంది. ఊట్కూర్ ఎస్ఐ కథనం ప్రకారం... మహారాష్ట్రలోని పూణే జిల్లాకు చెందిన ముఖేశ్ చౌహాన్ కోటారే (30) అనే వ్యక్తి నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలోని మారుతి బొగ్గుల బట్టీలో కలిసి కూలీ పని చేస్తున్నాడు. గత సోమవారం గ్రామ సమీపంలోని పెద్ద చెరువు కిందున్న వాగులో చేపలు, నీటి కోళ్లను పట్టుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం వాగులో ఆయన మృతదేహం తేలింది. స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. ఆనవాళ్లను బట్టి, సమీపంలోని బొగ్గుల బట్టీలో పని చేస్తున్న వారికి సమాచారం అందించడంతో వారు వచ్చి ముఖేశ్ చౌహాన్‌గా గుర్తించారు. సంఘటనపై మృతుడి తాత ముఖేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

గోవపై నుంచి కిందపడి

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన గోవ (వెదురు కర్రలు)పై నుంచి జారి పడి కార్మికుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీకి చెందిన పాలమూరు శ్రీనివాసులు (50) అదే కాలనీలో భవన నిర్మాణం పనులు చేస్తున్నాడు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం గోవపై నిలబడి పని చేస్తూ, ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై మృతుడి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మళ్లపల్లిలో దొంగల హల్‌చల్

» ఒకే రోజు అయిదు ఇళ్లలో చోరీ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కొత్తకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ గ్రామంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి అయిదు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామస్థులు బొగ్గు శ్యామల, మేస్త్రీ శేషన్న, సాంబ శివుడు, గోకారి నాగేంద్రం, కుమ్మరి శేఖర్ ఇంటి తాళాలను దొంగలు విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు. సాంబశివుడి ఇంట్లో రూ. 40 వేలు, శేఖర్ ఇంట్లో రూ. 10 వేలు, ఆర తులం బంగారం, శ్యామల ఇంట్లో రూ. 20 వేల విలువైన వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. శేషన్న, నాగేంద్ర ఇంట్లో నగదు, బంగారం చోరీ కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆనంద్ కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసు విచారణకు సీఐ ఆధ్వర్యంలో అయిదు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

పేదలపై పిడుగు

» పొలం పనుల్లో ఉన్నప్పుడే ఎక్కువ » ప్రాణాలు కోల్పోతున్న రైతులు, కూలీలు
» చనిపోతున్న పశువులు, గొర్రెలు, మేకలు » ముందు జాగ్రత్తలతో తప్పనున్న ముప్పు



అయిజ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పిడుగులు పేదల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. పంటల సాగుకు అత్యంత కీలక సమయమైన వర్షాకాలంలోనే ఈ ప్రమాదం పొంచి ఉంటోంది. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో వర్షం పడితే, వారు సమీపంలోని చెట్ల కిందకు చేరుతున్నారు. అదే సమయంలో పిడుగు పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వారితో పాటు పశువులు, మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. రైతులు, కూలీలకు అవగాహన లేక ముందు జాగ్రత్తలు తీసుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు.

పెరుగుతున్న మరణాలు

ఇటీవల కాలంలో పిడుగుపాటు మరణాలు ఎక్కువయ్యాయి. గత నెల 10వ తేదీన జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని భూమ్‌పూర్ సమీపంలోని పొలంలో కూలీలు పని చేస్తుండగా వర్షం పడింది. దీంతో వారు సమీపంలోని తాటి చెట్ల కిందకు వెళ్లి నిలుచున్నారు. అదే సమయంలో పిడుగు పడటంతో పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్యమ్మ, సర్వేశ్, పార్వతి ప్రాణాలు కోల్పోయారు. ఈనెల 21న రాజోళి మండలంలోని ముండ్లదిన్నె గ్రామానికి చెందిన కుర్వ మద్దిలేటి పొలం పనులు చేస్తుండగా, పిడుగు పడి మృతి చెందాడు. అలాగే ఇదే సంవత్సరం మానవపాడు మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బోయ వెంకటేశ్, వడ్డేపల్లి మండలంలోని బుడమర్సుకు చెందిన మహేంద్ర పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోయారు. కేటీదొడ్డిలో రైతు వేమారెడ్డికి చెందిన గేదెలు చనిపోయాయి. ధరూరు మండలంలో నర్సింహులుకు చెందిన రెండు కాడెద్దులు మృతి చెందాయి. మల్దకల్ మండలంలోని ఆలూరు బుడ్డన్నకు చెందిన 15 గొర్రెలు మత్యువాత పడ్డాయి. మొత్తంగా పరిశీలిస్తే పిడుగు పాటుకు బలవుతున్న వారిలో రైతులు, కూలీలే అధికంగా ఉన్నారు.

తక్షణ చర్యలు అవసరం

పిడుగుపాటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్) అందించాలి. సాధ్యమైనంత త్వరగా అంబులెన్స్‌కు సమాచారం అందించి బాధితుడిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. సరైన సమయంలో చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. అలాగే పిడుగుపాట్లకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని అందించేందుకు ప్రభుత్వాలు యాప్‌లు, ఇతర మాధ్యమాల ద్వారా ఇచ్చే వాతావరణ సూచనలు, హెచ్చరికలను గమనిస్తూ ఉండాలి.

అవగాహన లేక అనర్థాలు

పిడుగుపాట్లపై గ్రామీణ ప్రాంత ప్రజలకు, ప్రధానంగా రైతులు, వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించాల్సి ఉంది. సరైన అవగాహన లేకనే వారు ప్రాణాలు కోల్పోతున్నారు. పొలం పనుల్లో ఉన్నప్పుడు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షం వచ్చే సూచనలు కనిపిస్తే వెంటనే ఇళ్లకు చేరుకోవడం మంచిదని చెప్తున్నారు. వర్షం వచ్చే సమయంలో సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేయాలని అంటున్నారు. ఎత్తయిన చెట్లు, కొండలు, సెల్‌ఫోన్ టవర్లు, విద్యుత్ స్తంభాలు, ఎలక్ట్రిక్ వస్తువులు, పరికరాలకు దూరంగా ఉండాలి. అలాగే ఎత్తయిన భవనాల్లో తల దాచుకుంటే, కిటికీలు, తలుపులకు దగ్గరగా ఉండకూడదని చెప్తున్నారు. అలాగే పశువులను కూడా సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి. ఎత్తయిన భవనాలకు లైటనింగ్ కండక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు.



బింగిదొడ్డి గ్రామంలో పిడుగు పడి దగ్ధం అవుతున్న కొబ్బరి చెట్టు (ఫైల్)

కనుల పండువగా కల్యాణోత్సవం

» ప్రారంభమైన కురుమూర్తి బ్రహ్మోత్సవాలు
» స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
» మయూర వాహనంపై శ్రీనివాసుడి దర్శనం



స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా అర్చకులు, వేదపండితులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో కురుమూర్తి గిరులు మారుమోగాయి. భక్తులు దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం స్వామి సన్నిధిలో కొత్తకోట దయాకర్‌రెడ్డి కుమారుడు సిద్ధార్థరెడ్డి, నేహ దంపతులు కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అఖండ దీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు భాస్కరాచారి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పిచ్చి కుక్కల దాడి

» 9 మందికి గాయాలు

చారకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారగొండ మండలంలోని సిరసనగండ్లలో బుధవారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఒకే రోజు 9 తొమ్మిది మందిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితులు గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని, మెరుగైన వైద్యం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. అదేవిధంగా సిరసనగండ్లలో కుక్కల బెడదను నివారించాలని బీజేపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు.

కూరగాయల టెండర్‌పై గందరగోళం

» అన్యమతస్తురాలు దక్కించుకున్నట్లు ఫిర్యాదు » ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిర్ణయం తీసుకుంటాం : ఈవో

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అలంపూర్ క్షేత్రంలో ఇటీవల వేసిన కూరగాయల టెండర్‌పై గందరగోళం నెలకొన్నది. దసరా నవరాత్రులకు ముందు ఈవోగా బాధ్యతలు చేపట్టిన దీప్తి, ఆలయానికి అవసరమైన వివిధ రకాల వస్తువులు, ఏర్పాట్లకు సంబంధించి టెండర్లు పిలిచారు. అందులో భాగంగా కూరగాయల టెండర్‌ను అలంపూరు పట్టణానికి చెందిన శ్రీలత అనే మహిళ దక్కించుకున్నారు. నిబంధనల మేరకు నగదు కూడా జమ చేశారు. కానీ ఆమె హిందువు కాదంటూ కొందరు ఫిర్యాదు చేయడంతో, విచారణ నిమిత్తం హోల్డ్‌లో ఉంచారు. దీనిపై సదరు మహిళ భర్త తమను సంప్రదించగా, ఇదే విషయాన్ని చెప్పినట్లు ఈవో తెలిపారు. వాస్తవానికి చాలావాటికి టెండర్లు దాఖలు కాలేదన్నారు. దాఖలైన వాటిలో కొన్ని తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, దేవాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపించామని, వారే తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. విచారణలో అన్యమతస్తురాలని తేలితే టెండరును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. జోగుళాంబ అమ్మవారి దయవల్ల ఈ టెండరు తమకు వచ్చిందని, కానీ, మతం పేరుతో తమకు దూరం చేస్తున్నారని టెండరుదారు శ్రీలత ఆరోపించారు.

ఇటుకల మధ్య నాగుపాము



పామును డబ్బాలో బంధించిన శ్రీకాంత్

మిడ్జిల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం పేర్చి ఉంచిన ఇటుకల మధ్య నాగుపాము కనిపించింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలో జరిగింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సామెల్ ఇంటి నిర్మాణం కోసం ఇటుకలు తెచ్చి ఇంటి ముందు నిల్వ చేసుకున్నాడు. బుధవారం వాటి మధ్య పెద్ద నాగుపాము కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ సొసైటీకి సమాచారం అందించాడు. ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య సూచన మేరకు ఆయన శిష్యుడు, మిడ్జిల్ మండలం వేముల గ్రామానికి చెందిన శ్రీకాంత్, సామెల్ ఇంటి వద్దకు చేరుకొని సరక్షితంగా పామును బంధించారు. దానిని అడవిలో వదిలిపెట్టనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా పాము కనిపిస్తే 6305452891 నెంబర్‌కు ఫోన్ చేసి తమకు సమాచారం అందించాలని శ్రీకాంత్ ప్రజలను కోరారు.

అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర



ఊరేగింపునకు తరలివచ్చిన భక్తులు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు

వీపనగండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల కేంద్రంలో గంగమ్మ జాతర (పాముకాటు జాతర) అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆశ్వయుజ బహుళ శుద్ధ అమావాస్య నుంచి ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం అమ్మవారి ఊరేగింపుతో ముగిశాయి. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఊరేగింపునకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా యాదవ కులానికి చెందిన సుద్దుల వారు అమ్మవారి చరిత్ర గానం చేయగా అమ్మవారి భక్తుడు పూనకంతో ఊగిపోయాడు. ఈ సందర్భంగా అమ్మవారి నామస్మరణతో గ్రామం మారుమోగింది. అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా ఆలయం నుంచి గంగమ్మ బావి వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా జాతర మైదానంలోని గాజులు, చిన్నారుల ఆట వస్తువులు, పసుపు, కుంకుమ, గృహోపకరణాల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

రెండు వాహనాలు ఢీ, 8 మందికి గాయాలు

కొత్తకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బొలెరో, జీపు ఢీకొని 8 మంది గాయపడ్డారు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని నాగవెళ్లి శివారులో, జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్‌కు వెళ్తున్న బొలెరో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, రోడ్డు దాటి పెబ్బేర్ వైపు నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న తుఫాన్ జీపును ఢీకొన్నది. బొలేరెలో ఉన్న మహబూబ్‌పాషా, ముర్తిజావలి, చాంద్‌పాషా, అబ్దుల్ సుకర్, కమల్, తుఫాన్‌లో ఉన్న చైతన్య, సాయిలీల, మురళీధర్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి, క్షతగాత్రులను 108 అంబులెన్సులో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాకట్టు పెట్టిన బంగారాన్ని..

అమ్ముకున్న మేనేజర్

» అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

గద్వాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అవసరాల కోసం ఓ ప్రైవేటు సంస్థలో బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. ఆ బంగారాన్ని మేనేజర్ అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. ఆ విషయంపై బాధితుడు అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి బాధితుడు రాముడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్‌కు చెందిన రాముడు అనే వ్యక్తి గద్వాలలోని ఓ ప్రవేట్ సంస్థలో 28 గ్రాముల బంగారాన్ని కుదువపెట్టి రుణం తీసుకున్నాడు. గడువు దాటినా తిరిగి చెల్లించకపోవడంతో సంస్థ మేనేజర్ రాముడికి ఫోన్ చేసి, రుణం రెన్యువల్ చేసుకోకపోతే బంగారం పోతుందని చెప్పాడు. అసలు, వడ్డీ కలిపి రూ. 1,68,000 అయ్యిందని తెలిపాడు. అందుకు అంగీకరించిన రాముడు సంతకాలు చేశాడు. కానీ డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. 15 రోజుల క్రితం డబ్బు చెల్లించి, బంగారం తీసుకునేందుకు వెళ్లగా రాముడికి చుక్కెదురైంది. అప్పుడున్న మేనేజర్ లేడని, కొత్త వ్యక్తి వచ్చారని సిబ్బంది తెలిపారు. దీంతో కొత్త మేనేజర్‌ను సంప్రదించగా, మీరు అప్పుడు సంతకాలు చేశారని, మేనేజర్ బంగారాన్ని తీసుకెళ్లాడని చెప్పాడు. దీంతో బాధితుడు పాత మేనేజర్‌కు ఫోన్ చేశాడు. 'గడువు దాటినందున తాను బంగారాన్ని తీసుకొని అమ్మేశానని, రూ. 80 వేలు మాత్రమే ఇస్తానని స్పష్టం చేశాడు. మళ్లీ అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయంపై సీఐ టీ శ్రీనును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

చికిత్స పొందుతూ

వ్యక్తి మృతి

పాన్‌గల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి, చికిత్స పొందుత మృతి చెందాడు. పాన్‌గల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన గొల్లకుంట లక్ష్మయ్య (79) ఈ నెల 17న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు తీసుకునేందుకు ట్రాక్టర్‌పై పాన్‌గల్‌కు బయలు దేరాడు. ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న గొల్లకుంట లక్ష్మయ్య గోప్లాపూర్ శివారులోని మూలమలుపు వద్ద ప్రమాదవ శాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. సంఘటనపై మృతుడి కుమారుడు గోవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మహమ్మదాబాద్, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల పరిధిలోని సంగాయిపల్లిలో ఈ సంఘటన జరిగింది. పిచ్చకుంట్ల వెంకటయ్య బుధవారం తన గేదెను మేతకు తీసుకెళ్లాడు. అది మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గుర్రై చనిపోయింది. దాని విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఇంటర్వ్యూ..

యాసంగిలో అధిక దిగుబడి రకాల విత్తనాలు విత్తుకోవాలి

- బి.రాజశేఖర్, కేవీకే విస్తరణ శాస్త్రవేత్త



బిజినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో విస్తారంగా కురిసిన వర్షాలకు చాలా పంటల దిగుబడి తగ్గిందని, రాబోయే యాసంగి సీజన్‌లో ఈప్రాంత వాతావరణ పరిస్థితులకు అనువైన విత్తన పంట రకాలను ఎంచుకొని విత్తుకోవాలని పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.రాజశేఖర్ సూచించారు. మేలు రకాలను ఎంపిక చేసుకోవడంతో పాటు సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకొని అధిక దిగుబడులు పొందాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

భూసార పరీక్షలతో ఎలాంటి లాభాలు చేకూరుతాయి?

రైతులు పంట సాగు చేపట్టే ముందు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూమిలో లోపించిన పోషకాలను మాత్రమే చల్లుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. నేల ఆరోగ్యం దెబ్బతినకుండా ఆరోగ్యవంతమైన పంట దిగుబడి పొందవచ్చు.

విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా కలిగే లాభాలేమిటి?

విత్తనాన్ని శుద్ధి చేసుకొని విత్తుకోవడం ద్వారా పంటకు ఆశించే తెగులు, పురుగుల ఉధృతిని ఆదిలోనే అరికట్టవచ్చు. తద్వారా పైపాటుగా పిచికారి చేసుకునే క్రిమి సంహారకాల వినియోగం తగ్గి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చు.

యాసంగిలో ఏ పంటలు వేసుకుంటే రైతులకు లాభదాయకంగా ఉంటుంది?

దక్షిణ తెలంగాణ ప్రాంతంలో యాసంగి సీజన్‌లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, మినుము పంటలను రైతులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. నీటి వసతి ఉన్న రైతులు అధిక దిగుబడినిచ్చే రకాలను వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు సూచించే నాణ్యమైన రకాలను విత్తుకోవడంతో పాటు వారిచ్చే సూచనలు సలహాలు పాటించాలి. నీటి లభ్యత తక్కువగా ఉండే రైతులు ఆరుతడి పంట రకాలను, కూరగాయలను విత్తుకొని అధిక దిగుబడులతో ఆర్థికంగా లాభపడాలి.

ఘనంగా అయ్యప్ప మాలధారణ

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అభినవ వీర మణికంఠ ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలధారణ నిర్వహించారు. గురుస్వాములు రామచంద్రయ్య, రామ్మోహన్‌రావు, శ్రీనివాసులు, గోపినాయక్ ఆధ్వర్యంలో 30మంది మండల దీక్షను చేపట్టారు. దీక్షా సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలను గురుస్వాములు మాల ద్వారా సాములకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు చెస్‌బోర్డులు పంపిణీ

తాడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఎన్‌ఆర్‌ఐ ఫోరం, రెడ్‌క్రాస్ సహకారంతో 149చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఎంఈవో జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ ఫోరం కో ఆర్డినేటర్ రమేష్, మహిపాల్‌రెడ్డి, రమేష్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, త్యాగరాజుగౌడ్, శేఖర్‌గౌడ్, అనిల్‌కుమార్‌రెడ్డి, రమేష్‌కుమార్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ పతాకావిష్కరణ

కందనూలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లోని లక్ష్మణచారి భవన్ వద్ద దళిత హక్కుల పోరాట సమితి 19వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి మాట్లాడుతూ దళితుల ఐక్యతకు కృషి చేస్తూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో సమానత్వ సాధన కోసం సంఘం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు చిన్నపాగ శ్రీను, బాలపీరు, కొత్త రామస్వామి, మారేడు శివశంకర్, గోపి, భూపేష్, లక్ష్మయ్య, రాహుల్ పాల్గొన్నారు.

'బస్సు సౌకర్యం కల్పించాలి'

వంగూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నుంచి మధ్యాహ్నం వేళలో మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కల్వకుర్తి నుంచి మధ్యాహ్నం 1గంటకు బయల్దేరి వంగూరు, ఉమ్మాపూర్ మీదుగా డిండి వరకు వెళ్లి తిరిగి రావడంతో ఎంతో సౌకర్యంగా ఉండేదని, ఇప్పుడు ఆర్టీసీ అధికారులు ఆ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి డిపో మేనేజర్ వెంటనే స్పందించి మధ్యాహ్నం వేళ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



వెన్నచెర్ల నుంచి దేవునితిర్మలాపూర్ వెళ్లే రహదారిపై ఉన్న మలుపు

- ప్రమాదకరంగా రోడ్లపై మలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యం. ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ ప్రధాన రహదారులపై పలు చోట్ల అనేక ప్రమాదకర మైన మలుపులు ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద కొత్తపల్లి నుంచి దేవుని తిర్మలాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై వెన్నచెర్ల నుంచి దేవునితిర్మలాపూర్ వెళ్లే రహదారిపై పెద్దకార్పాముల నుంచి మరికల్ వెళ్లే రహదారిపై పెద్దకార్పా ముల నుంచి వయా నాయినోనిపల్లి మీదుగా యాపట్లకు వెళ్లే రహదారులపై ఇలా అనేక చోట్ల మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి దాపురించింది. ఎత్తు పల్లాలతో ఉండే ఈ రహదారులపై ఎన్నో చోట్ల మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల దగ్గర అనేక మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మలుపుల దగ్గర అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు ఉండడం వలన రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించే మలుపుల దగ్గర రోడ్డుకిరు వైపులా ఉన్న చెట్లను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల దగ్గర ఎన్నో మార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మలుపులు దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

- ముచ్చపోతు శంకర్, వెన్నచెర్ల

గిరిజన తెగువకు చిహ్నం కొమరం భీం

- ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి
- జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా కొమరం భీం జయంతి



కొమరం భీం చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో గిరిజనుల పోరాట తెగువకు కొమరం భీం జీవితం చిహ్నంగా నిలిచిందని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొమరం భీం జయంతి నిర్వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాంజలి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్ కొమరం భీం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ 1901 అక్టోబరు 22న ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన గోండు కుటుంబంలో జన్మించిన కొమరం భీం బాల్యం నుంచి పేదరికం, సామాజిక అన్యాయంతో జీవించారని పేర్కొన్నారు. 1930లో నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్, జంగిల్, జమీన్ అనే నినాదాన్ని ముందుకు నడిపించి గిరిజనుల పర్యావరణ హక్కులు, భూమి, నీరు, అడవి పట్ల ఉన్న సంబంధాన్ని తెలిపారన్నారు. కొమరం భీం ఆశయ సాధనకు యువత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ధర్మ, అధ్యాపకులు రవీందర్ నరేష్, మల్లేష్, కృష్ణ, సతీష్, దీపిక, మౌనిక, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు, పట్టణ కార్యదర్శి ప్రసాద్ కుమార్, నాయకులు శివ, మల్లేష్, రమేష్, శివ, భరత్, కీర్తన, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ నిరంజన్ ముదిరాజ్

అచ్చంపేటటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ నిరంజన్ ముదిరాజ్ అన్నారు. ఈ నెల 24న జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్ విశారదన్ మహారాజ్ సారథ్యంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బుధవారం పట్టణంలోని విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే మహాధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులుసాయి, సురేష్, శ్రీధర్, లింగం, వీరయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన

కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : బీసీలకు పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయం ముందు బీసీ జేఏసీ నాయకులు నిరసన తెలిపారు. బీసీలకు 42 శాతం కల్పించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ అనితకు బీసీ జేఏసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేయకుండా పార్లమెంట్‌లో బీసీ 42శాతం రిజర్వేషన్ల అమలు చట్టబద్ధ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలరిజర్వేషన్లు సాధించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు సదానందంగౌడ్, రాజేందర్, శ్రీనివాసులు, భగత్ సింగ్, పాండుగౌడ్, గోపాల్, సుధాకర్, రామకృష్ణ, గణేష్, రుక్కుల్‌గౌడ్, వెంకటేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో డీటీ అనితకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

ఎస్‌ఆర్ శంకరన్‌కు ఘన నివాళి



ఎస్‌ఆర్ శంకరన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో స్వేరోస్ దినోత్సవాన్ని బుధవారం ఆ సంస్థ డివిజన్ అధ్యక్షుడు వట్టిపు కిశోర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుకులాల సృష్టికర్త ఎస్‌ఆర్ శంకర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి నిరంతరం పోరాటం చేసిన మహనీయులు ఎస్‌ఆర్ శంకరన్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లెల మాజీ ఉప సర్పంచ్ గుమ్మకొండ రాజు, నాయకులు నాగేష్, భీమయ్య, నిరంజన్, మల్లేష్, అశ్విన్ కుమార్, ఎం.రమేష్, డి.గణేష్, కృష్ణ, వట్టిపు గణేష్, పాండు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య ఆలయంలో డాక్టర్ అనురాధ పూజలు



ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న డాక్టర్ అనురాధ

మన్ననూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరులోని శ్రీశైలం- హైదరాబాద్ రహదారి పక్కన గల లింగమయ్య ఆలయాన్ని సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ బుధవారం సందర్శించారు. కార్తీక మాసం పురస్కరించుకొని లింగమయ్యకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, సంతోష్, ఆలయ అర్చకుడు నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బ్రహ్మగిరి, (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం బ్రహ్మగిరిలో కొన్ని రోజుల క్రితం మృతి చెందిన సోదరులు చిట్టి వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను మాజీ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ బుధవారం పరామర్శించారు. దశదినకర్మ కార్యక్రమానికి హాజరై బాధిత కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. కార్యక్రమంలో వటవర్లపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అలివేల, కాంగ్రెస్ నాయకులు మొయిజొద్దీన్, ఇస్మాయిల్, సిరాజ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మన్ననూర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో గల కృష్ణగిరి పోలీస్ ఠాణాను వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన సందర్శించారు. ఠాణాలో నమోదైన రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, కృష్ణగిరి ఎస్ఐ జయన్న పాల్గొన్నారు.

జాగృతి యువత మండల అధ్యక్షుడిగా పవన్‌కుమార్‌గౌడ్



కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న పవన్‌కుమార్‌గౌడ్

తిమ్మాజిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాగృతి యువత మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని రాళ్ల చెరువు తండా గ్రామపంచాయతీ శ్రీనివాస్ పల్లికి చెందిన ఎలుక పవన్‌కుమార్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన తెలంగాణ జాగృతి అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

- పశువైద్యాధికారి శ్రావణి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

తిమ్మాజిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పని సరిగా వేయించాలని పశువైద్యా ధికారి శ్రావణి సూచించారు. మండలంలో బాజీపూర్, ఆవంచ, అప్పాజీపల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. 320తెల్లపశువులకు, 257 నల్లజాతి పశువులకు టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, తమ పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది విజయలలిత, తిరుపతయ్య, ఖాదర్, యాదగిరి, శాంతయ్య, రవి, గోపాలమిత్రలు స్వామి, జగ్జీవన్‌రాం పాల్గొన్నారు.

● వెల్దండ (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కుప్పగండ్ల, భైరాపూర్ గ్రామాలలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్యాంసుందర్ కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్‌రెడ్డి, ఫణీందర్‌రెడ్డి, శ్రీను, తిర్పతయ్య, నర్సింహ, గోపాలమిత్రలు సాయిబాబు, మొగులయ్య, బాలు, విజేందర్ తదితరులు ఉన్నారు.

● వంగూరు, (ఆంధ్రజ్యోతి) : పశువులకు తప్పని సరిగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని గాజర, జాజాల గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశువులకు గాలికుంటు వాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైదులు, వెంకటయ్య పాల్గొన్నారు.

హై సపోర్టు నీడ్ కోసం దరఖాస్తు చేసుకోండి

- జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి

నాగర్‌కర్నూల్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కండరాల క్షీణతతో రోజువారి కార్యక్రమాలకు ఇతరులపై ఆధారపడిన వారు హై సపోర్టు నీడ్ కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 40శాతం అంతకన్నా ఎక్కువ వికలత్వం కలిగిన దివ్యాంగులు వారి సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆదాయం ధ్రువపత్రం, తెల్ల రేషన్ కార్డులతో పాటు రెండు పాస్ పోర్టు ఫొటోలు జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన జిల్లాలోని దివ్యాంగులు పూర్తి చేసిన దరఖాస్తును నిర్దేశించిన తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సరకులు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంకోజీ

ఊర్కొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మృతుడి కుటుంబానికి హెడ్ కానిస్టేబుల్ అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గడ్డం మహేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఊర్కొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దండోత్కర్ వెంకోజీ, మహేందర్ అంత్యక్రియల రోజు ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు దశదినకర్మకు కావాల్సిన నిత్యావసర వస్తువులను బుధవారం మృతుడి భార్య, కుటుంబ సభ్యులకు అందించారు. దాంతో మండల ప్రజలు హెడ్ కానిస్టేబుల్ దాతృత్వానికి ప్రశంసించారు.

నేడు ప్రజావేదిక

ఉప్పునుంతల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధిహామీ పథకం కింద ఒకటి ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీపై గురువారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో పర్వతాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సామాజిలతనిఖీ సమావేశానికి మండలంలోని ఉపాధి హామీకూలీలు హాజరుకావాలని ఆయన కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



చంద్రబండతండాలో ఇందిరమ్మ ఇంటి పనులకు లబ్ధిదారుతో కలిసి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని అర్హులైన నిరుపేదలందరికీ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చంద్రబండతండా గ్రామంలో కేతావత్ ప్రసాద్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్, నాయకులు వేణుగోపాల్‌నాయక్, హేమ్లానాయక్, రామ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసులు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాముడు



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు

కల్వకుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో బుధవారం కేవీపీఎస్ డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.180 కోట్ల బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పులిజాల అశోక్, మండల అధ్యక్షుడు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల సహృదయంతో మెలగాలి



మాట్లాడుతున్న అడ్వకేట్ శ్రీరామ్ ఆర్య

బిజినేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతీ ఒక్కరం మానసిక, శారీరక వికలాంగుల పట్ల సహృదయంతో మెలగాలని జిల్లా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ శ్రీరామ్ ఆర్య సూచించారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. 2016 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం వికలాంగుల హక్కుల చట్టం రూపొందించిదని, ఆ చట్టాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల హక్కులు అమలు చేయడంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ పౌరులతో సమానంగా స్వేచ్ఛ, వ్యక్తిగత హోదా, గౌరవం, సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కల్పించడం లో ఎలాంటి వివక్ష చూపరాదని సూచించారు. వైకల్యం ఉన్న వ్యక్తుల పట్ల క్రూరంగా ప్రవర్తించినా, హింసించినా, అవమాన కరంగా మాట్లాడినట్లు రుజువైనా చట్టరీత్యా జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. వికలాంగులు తమ సమస్యల గురించి టోల్ ఫ్రీ నెంబరు 14416కు ఫొన్ చేసి తెలుపుకొనే అవకాశం ఉందన్నారు. మరే ఇతర సమస్యలు ఉన్నా ఉచిత న్యాయ సహాయం, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబరు 15100కు ఫొన్ చేసి లబ్ధిపొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలికలు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఎస్‌వీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్బారావు



కేజీబీవీలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సంస్థ డైరెక్టర్ సుబ్బారావు

లింగాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఎస్‌వీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్బారావు కోరారు. ఎస్‌వీఎస్ ప్రాజెక్టు ఆర్థిక సహాయంతో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పాఠశాలలో రూ.2.60లక్షల విలువ గల పుస్తకాలు, అలమరాలు అందజేశారు. 45మంది విద్యార్థినులకు స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు విజయకుమారి, అరణ్య, నైస్ ఫౌండేషన్ అధినేత పూర్ణచంద్రరావు, కేజీబీవీ విద్యాలయం ఎస్‌వో శారద, ఆర్‌డీటీ ఏరియా టీం లీడర్ రాధమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.